సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

సోమవారం । 23 । జూన్ । 2025



సౌరశక్తి..అనాసక్తి

సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై రైతుల్లో ఆసక్తి తగ్గింది. ప్రతీనెల ఆదాయం నిలకడగా వస్తుందనే నమ్మకం లేకపోవడంతో రైతుల్లో విముఖత వ్యక్తమవుతోంది. - 8లో▸



దొంగల ముఠా అరెస్ట్

పక్కా ప్రణాళికతో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీకి పాల్పడుతున్న ఏడు గురు దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $36^0/25^0$

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రతీ రైతుకు భరోసా

భూపాలపల్లి రూరల్: రైతు భరోసా కింద ఆదివారం వరకు జిల్లాలో రూ.132,52,49,227 నేరుగా రైతుల ఖాతాల్లో జమయ్యాయని, ప్రతీ రైతుకు రైతు భరోసా జమ అవుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భరోసా పథకం కింద జిల్లాలోని 1,14,011మంది రైతుల ఖాతాల్లో మొత్తం రూ.1,32,52,49,227 నేరుగా జమచేసినట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సాగు అవసరాలకు ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు.

చర్యలు తప్పవు..

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలో ప్రభుత్వ పనులకు సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం నాగారం గ్రామంలో పోలీసులు విచారణ చేపట్టారు. శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు.

జిల్లాస్థాయి క్రీడా పాఠశాల ప్రవేశాల ఎంపిక


భూపాలపల్లి అర్బన్: ఈ నెల 25వ తేదీన క్రీడా పాఠశాలకు జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాము ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలస్థాయిలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయి పోటీలకు హాజరయ్యే విద్యార్థులు పుట్టినతేది ధృవీకరణ పత్రం, కుల, స్టడీ సర్టిఫికెట్, పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

సిరిసిల్ల పరామర్శ



టేకుమట్ల: ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్ కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాజర్ల రవి పీడిత ప్రజల కోసం తన జీవితాన్నే త్యాగం చేశాడన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ సంగి రవికుమార్, మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, నాయకులు కత్తి సంపత్, శ్రీనివాస్, రవిందర్, వంగ నరేష్, కోరె చంద్రమౌళి, జంగపెల్లి సారయ్య, తిరుపతి, ఉన్నారు.

పామాయిల్ తోట దగ్ధం



రేగొండ: మండలంలోని రేపాకపల్లి గ్రామంలో ఓ రైతుకు చెందిన పామాయిల్ తోటకు గుర్తుతెలియని వ్యక్తులు శనివారం నిప్పుపెట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రేపాకపల్లి గ్రామానికి చెందిన చేరి సబిత రెండు ఎకరాలలో పామాయిల్ తోట సాగుచేశారు. పంట కోతకు రావడంతో ఆదివారం ఉదయం కూలీలతో చేను దగ్గరికి వెళ్లే సరికి పంట మొత్తం దగ్ధమైంది. చేతికందిన పంట కాలిపోవడంతో రూ.3లక్షలు నష్టపోయామని బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యారు.

యాజమాన్య విధానాలు సరికాదు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి యాజమాన్యం చేపడుతున్న బదిలీల విధానాలు సరికాదని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాలకు మించి ఎక్కువ సర్వీస్ ఉన్న కార్యాలయ సిబ్బందిని ఇతర శాఖలకు బదిలీ చేయాలని కోరారు. గతంలో పనిచేసిన విభాగాలకు బదిలీ చేయకూడదన్నారు. పరస్పర బదిలీలకు కఠిన నిబంధనలతో కూడిన సర్క్యులర్ యాజమాన్యం సవరించాలని కోరారు. అధికారులు ఐదు సంవత్సరాల నుంచి ఒకే ఏరియాలో పనిచేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ 10 సంవత్సరాలకు పెంచడం సరికాదన్నారు.

పోరాటం చేయాలి

ములుగు రూరల్: సామాజిక న్యాయం కోసం ప్రతిఒక్కరూ పోరాటం చేయాలని సామాజిక న్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడు పోరిక శ్యామల్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడ్డి కులానికి చెందిన వారికే ఎక్కువ సంఖ్యలో మంత్రి పదవులు దక్కుతున్నాయని ఆరోపించారు.





ప్రైవేట్ దోపిడీ..?

పాఠ్య, పుస్తకాలు, యూనిఫాంలు, టై బెల్టుల విక్రయం

అంతా వ్యాపార ధోరణే..

ప్రైవేట్ పాఠశాలల్లో విద్య వ్యాపార ధోరణితో కొనసాగుతుందనే ఆరోపణలు లేకపోలేదు. విద్యార్థుల ఫీజులు మొదలుకొని, పుస్తకాలు, యూనిఫాం, రవాణ, టర్మ్ ఫీజుల పేరిట బాదుతున్నారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు కాకుండా నోట్‌బుక్స్, ఆయా పాఠశాలల వర్క్ బుక్స్ పేరిట రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇవే పుస్తకాలు దుకాణాల్లో కొనుగోలు చేస్తే రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు మించవని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుస్తకాలు బయట కొనుగోలు చేస్తే యాజమాన్యాలు అనుమతించడం లేదనే ఆరోపిస్తున్నారు.

- తల్లిదండ్రులపై ఆర్థిక భారం
- చోద్యంచూస్తున్న విద్యాశాఖ అధికారులు

కాటారం: జిల్లాలో పలు ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చుకుంటున్నాయి. అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులు సతమతమవుతుంటే మరో పక్క పాఠ్య, రాత పుస్తకాలు, టై, బెల్టులు, యూనిఫామ్స్ కూడా పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని యాజమాన్యాలు నిబంధనలు పెడుతుండటంతో ప్రైవేట్‌లో విద్యను కొనుగోలు చేయడానికి సతమతమవుతున్నారు. ప్రతి ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఈ తంతు యథావిధిగా నడుస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

నామమాత్రంగా తనిఖీలు..

ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాంలు, టై, బెల్టులు, ఇతర సామగ్రి విక్రయించకూడదని విద్యాశాఖ నిబంధనలు కఠినంగా ఉన్నాయి. అయినప్పటికీ వీటిని బేఖాతరు చేస్తూ యాజమాన్యాలు తమ వ్యాపారం తాము కొనసాగిస్తున్నారు. ఇది బహిర్గతంగా జరుగుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. విద్యార్థి సంఘాల నాయకులలో లేక ఇతరత్రా సంఘాల నాయకులో ఫిర్యాదు చేస్తే ఫిర్యాదులో పేర్కొన్న పాఠశాలకు అధికారులు ముందస్తు సమాచారం చేరవేసి తనిఖీలకు వెళ్తున్నారనే ఆరోపణలు దండిగా ఉన్నాయి. తప్పనిసరిగా దాడులు చేయాల్సి వస్తే అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేపట్టి కంటితుడుపు చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు సైతం లేకపోలేదు.

మొదలైన విక్రయాలు..

ఈ నెల 12నుంచి జిల్లాలో పాఠశాలలు తెరుచుకున్నాయి. అడ్మిషన్లు జోరుగా జరుగుతుండటంతో ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అధిక ఫీజులతో పాటు పాఠ్య పుస్తకాలు, ఇతర సామగ్రి పేరిట ఒకే సారి అందిన కాడికి దండుకుంటున్నారు. జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో యజమాన్యాలు బహిరంగంగానే పుస్తకాలు, యూనిఫాంల వ్యాపారం కొనసాగిస్తున్నారు. పాఠశాలల్లోనే ఓ గదిలో పాఠ్య పుస్తకాలు, తమ పాఠశాలల పేరిట ముద్రించిన నోట్ బుక్కులు, యూనిఫాం, టై, బెల్టులు భద్రపరిచి ప్రత్యేకంగా ఓ ఇన్‌చార్జ్‌ని నియమించి విక్రయాలు చేపడుతున్నారు. దీంతో ప్రత్యక్షంగా పాఠశాలల్లో బుక్ సెంటర్లనే తలపించే రీతిలో పుస్తకాల వ్యాపారాలు కొనసాగుతున్నాయి.

విక్రయాలపై దృష్టి సారించాలి..



విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో పలు ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, టై, బెల్టుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లోని పలు పుస్తకాల పబ్లిషర్స్‌తో పాఠశాల యజమాన్యాలు కుమ్మక్కై తమ ఇష్టమొచ్చిన ధరలకు విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ అంటగడుతున్నాయి. విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలల్లో బుక్స్ విక్రయాలపై దృష్టి సారించాలి.

– బొడ్డు స్మరన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

చర్యలు తీసుకుంటాం..



ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి. పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ విక్రయించ కూడదు. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలలకు హెచ్చరికలు జారీ చేశాం. ఎవరైనా స్టేషనరీ వ్యాపారం చేయడం లాంటి వాటికి పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రైవేట్‌వైపే మొగ్గు..

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం ప్రైవేట్ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 430 ప్రభుత్వ పాఠశాలలు, 75 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. అత్యధికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 19,788మంది విద్యార్థులు చదువుతుండగా.. కేవలం 75ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 26వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండటంతో పాటు పాఠ్య, రాత పుస్తకాలు, యూనిఫామ్స్, అలాగే మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. అయినప్పటికీ తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు ఆసక్తి చూపుతుండటంతో ప్రైవేట్ విద్యా సంస్థల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.

మేడం.. ఏదో ఒకటి తేల్చండి..!

ఆ ఇద్దరి వ్యాఖ్యలతో ప్రజల్లో పలుచబడుతున్నాం

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌తో 'కొండా' వ్యతిరేక ప్రజాప్రతినిధులు
- హైదరాబాద్‌లో మీనాక్షి, మల్లు రవిని కలిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు
- కమిటీ వేసి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ..
- నేడో, రేపో అధికారిక ప్రకటన..

సాక్షిప్రతినిధి, వరంగల్: మంత్రి కొండా సురేఖ దంపతులు వర్సెస్ ఎమ్మెల్యేల వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పేషీకి చేరింది. ఇటీవల మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళీ వ్యాఖ్యలను.. వారి వ్యతిరేక వర్గం ప్రజాప్రతినిధులు మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరుల బృందం ఆదివారం హైదరాబాద్‌లో నటరాజన్‌ను కలిశారు. 'మంత్రి కొండా సురేఖ దంపతుల వ్యాఖ్యలు పార్టీని, నాయకులను ఇబ్బంది పెట్టేలా ఉన్నాయి. వారి వైఖరి, వ్యాఖ్యలతో ప్రజల్లో పలుచబడి పోతున్నాం.. ఇక భరించలేం.. మేడం.. మీరు ఏదో ఒకటి తేల్చండి.. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోండి' అంటూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలపై బహిరంగంగా కామెంట్లు చేయడం, సీనియర్లని చూడకుండా పరుషపదజాలాన్ని వాడటం పార్టీ ఇమేజ్‌ను దిగజార్చేలా ఉందని బృందం వివరించింది. ఫిర్యాదులను స్వీకరించిన మీనాక్షి నటరాజన్.. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటామని, అన్ని కోణాల్లో పార్టీ పరంగా విచారించేందుకు త్వరలోనే కమిటీ వేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. హైకమాండ్ దృష్టికి తీసుకెళ్తానని కూడా చెప్పినట్లు సమాచారం. అక్కడి నుంచి వరంగల్ కాంగ్రెస్ నాయకుల బృందం పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవిని కలిసి కొండా దంపతులపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. గత ఐదారు రోజులుగా వరంగల్‌లో జరుగుతున్న కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలు, కొండా దంపతుల వ్యాఖ్యలు, వైఖరిని ఆయనకు వివరించినట్లు తెలిసింది. సానుకూలంగా స్పందించిన మల్లు రవి పార్టీ పెద్దల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడంతో ప్రజాప్రతినిధుల బృందం వెనుతిరిగినట్లు సమాచారం. కాగా కొండా దంపతులపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఇద్దరు లేదా ఐదుగురు సీనియర్లతో నేడో, రేపో కమిటీ వేసి విచారణ చేపట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

హామీలను అమలుచేయాలి

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారత్నం



సమావేశంలో మాట్లాడుతున్న రాజారత్నం

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ.6లక్షల నిధులు కేటాయించాలని దళితులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందుకూరి రాజారత్నం డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో జరిగిన దళిత హక్కుల పోరాట సమితి నాయకులు పొనగంటి లావణ్య అధ్యక్షతన మూడవ జిల్లా మహాసభకు రాజారత్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని కోరారు. అంబేడ్కర్ యోజన పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న దళిత కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసపల్లి భద్రయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, నేరెళ్ల జోసెఫ్, పసరగొండ మహేందర్, బొౌతు కమలాకర్, దొంతుల రవీందర్, రాజమౌళి, గుర్రం సంపత్, రమేష్ రాజేష్, చిట్యాల పద్మ, బానమ్మ పాల్గొన్నారు.

సమ్మక్కసాగర్ బ్యారేజీలోకి నీటి ప్రవాహం తగ్గడంతో కనిపిస్తున్న ఇసుక మేటలు



సమ్మక్కసాగర్‌లో ఇసుక మేటలు

ఎగువ నుంచి తగ్గిన నీటి ప్రవాహం

కన్నాయిగూడెం: మండల పరిధిలోని తుపాకుల గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల గోదావరిపై నిర్మించిన సమ్మక్కసాగర్ బ్యారేజీకి నీటి ప్రవాహం తగ్గడంతో ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. జూన్ మొదటి వారంలో వర్షాలు పడడంతో బ్యారేజీలోకి కొంత నీరు వచ్చి చేరింది. దీంతో బ్యారేజీలో నీటి ప్రవాహం కొంత పెరిగింది. ప్రస్తుతం వర్షాలు పడకపోవడంతో ఎగువ నుంచి గోదావరిలోకి వరద ప్రవాహం తగ్గిపోయింది. దీంతో సమ్మక్క సాగర్ బ్యారేజీలో ఇసుక మేటలు తేలి కొంత మేర ఎడారిగా దర్శనమిస్తున్న పరిస్థితి నెలకొంది. బ్యారేజీలోకి ఎగువ నుంచి 5,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా బ్యారేజీ వద్ద రెండు గేట్లు ఎత్తి 6వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. బ్యారేజీ సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.922 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.

భద్రకాళి అమ్మవారికి రూ.కోటితో రథం

- ఆలయ ధర్మకర్తల మండలి తీర్మానం
- 26నుంచి శాకంబరీ ఉత్సవాలపై సమావేశం



మండలి సమావేశంలో పాల్గొన్న మండలి చైర్మన్, ఈఓ, ధర్మకర్తలు

హన్మకొండ కల్చరల్ : కంచి కామాక్షి అమ్మవారి రథం మాదిరిగా శ్రీభద్రకాళి అమ్మవారికి రూ.కోటి వ్యయంతో రథం తయారు చేయించడానికి ఆలయ ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే శాకంబరీ ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించేందుకు ఆదివారం దేవాలయ కార్యాలయంలో వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ బండారు శివసుబ్రహ్మణ్యం అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఆలయ ఈఓ శేషుభారతి, ధర్మకర్తలు, ఆలయ ప్రధానార్చకులు శేషు పాల్గొన్నారు. అమ్మవారి గుడి చుట్టూ మాడవీధుల నిర్మాణం జరుగుతున్నందున ఇకపై అమ్మవారికి నిర్వహించే వాహన, రథసేవలు మాడవీధుల గుండానే చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఆగమశాస్త్రం ప్రకారం టేకు కర్రతో రథం తయారు చేయించడానికి మండలి తీర్మానించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతికి కృషి చేయాలని మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని ధర్మకర్తల మండలి సభ్యులు కోరారు. నిత్యం ఉదయం, సాయంత్రం, రాత్రి మహాపూజ అనంతరం భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేయాలని, ఇందుకు శాశ్వత నిధిని బ్యాంకులో ఏర్పాటు చేయడానికి దాతలు విరాళం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అర్చకులు భద్రకాళి శేషు, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గడె శ్రవణ్‌కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరి, గండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగుల అంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్‌రావు, పార్నంది నరసింహమూర్తి పాల్గొన్నారు.

క్లైమాక్స్‌కు 'దత్తత దందా'

8 మందిని విచారించిన వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

- అసలు లేని పాఠశాల నుంచి నకిలీ బర్త్ సర్టిఫికెట్లపై విస్మయం
- ఓవైపు విచారణ.. మరోవైపు ఓ ఉద్యోగి రాజీనామాతో అనుమానాలు



సాక్షి, వరంగల్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'దత్తతలో నకిలీ సర్టిఫికెట్ల దందా' విచారణ క్లైమాక్స్‌కు చేరుకుంది. ఇటు పోలీసులు, అటు అధికారులు వేర్వేరుగా చేసిన విచారణ నివేదికల ఆధారంగా కలెక్టర్ సత్యశారద ఆదేశాలకు అనుగుణంగా బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశముంది. ఇప్పటికే గతంలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో జిల్లా సంక్షేమ విభాగంలోని వీహబ్‌లో ఉద్యోగం పొంది ఏడాదికిపైగా విధులు నిర్వర్తించిన సిక్కుల సుజాతపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లుగానే దత్తత వ్యవహారంలో నకిలీ బర్త్ సర్టిఫికెట్లతో సంబంధమున్న సిబ్బందిపై కూడా చట్టపరమైన చర్యలకు అవకాశముంది. ఇందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారే, కొన్ని నెలల క్రితం ఓ దత్తత విషయంలో నిబంధనలు అతిక్రమించి మెమో అందుకున్నా కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ 'మంత్రి' దగ్గరికి వెళ్లి జిల్లా పాలనాధికారిపై ఒత్తిడి తెచ్చి ఉద్యోగం పోకుండా చూసుకున్నారనే ప్రచారం ఉంది. ఈసారి కూడా నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం తన మెడకు చుట్టుకుంటుందనే ఉద్దేశంతో మరోమారు సదరు మంత్రితోపాటు ఓ ఎమ్మెల్యే నుంచి కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి ఈ విచారణను నీరుగార్చేలా చేశారనే టాక్ ఉంది. ఈ కేసు విషయంలో కలెక్టర్ సత్యశారద పారదర్శక విచారణ నివేదిక తెప్పించుకుంటున్నా.. అలోపే బ్రేక్ వేయాలనుకుంటుండడం గమనార్హం. నకిలీ బర్త్ సర్టిఫికెట్ల వ్యవహారంలో కలెక్టర్ ఏ నిర్ణయం తీసుకుంటున్నారనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ఈ దందాలో 8 మందిని పోలీసులు విచారించారు. అసలే పాఠశాల లేని, అది కూడా నర్సంపేట కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్లు రూపొందించడంతో విస్మయం చెందారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్ ఈమెయిల్ ఇవ్వడంపై అనుమానాలు..

నకిలీ సర్టిఫికెట్ల దందాపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ విభాగం డైరెక్టరేట్ కార్యాలయం నుంచి విచారణ చేసి వెంటనే నివేదిక సమర్పించాలని వచ్చిన సంబంధిత విభాగాధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కారా నిబంధనల ప్రకారం దత్తత కోరుకునే దంపతుల దరఖాస్తు సమయంలో వారి ఈమెయిల్ ఐడీ ఇవ్వాలి. లేదంటే ఆఫీస్ మెయిల్ ఐడీ కూడా ఇవ్వొచ్చు. అయితే వీరు మాత్రం పాప రావడానికి ఎంత వరుసలో ఉన్నాం, ఇంకెంత మంది ముందున్నారు, పాప రెఫరల్ వచ్చే సమాచారం కోసం సదరు అధికారితోపాటు అప్పుడు ఈ విభాగంలో పనిచేసే ఓ డాటా ఎంట్రీ ఆపరేటర్ వ్యక్తిగత 'ఈ-మెయిల్స్' ఇవ్వడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. కారా నుంచి వచ్చే సమాచారం తమ మెయిల్‌కు రాగానే మీకు పాప మరో వారం రోజుల్లో వస్తుంది, మాకేం చేస్తారనే మాటమంతీ జరిగి ఉండొచ్చని విచారణ చేసిన పోలీసులు కూడా అనుమానిస్తున్నారు. అలాగే, విచారణ జరుగుతుండగానే బాలరక్షా భవన్‌లో పనిచేస్తున్న నర్సంపేటకు చెందిన ఓ వ్యక్తి ఉద్యోగానికి రాజీనామా చేశారు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు అతడి పాత్రపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఎందుకంటే ఏడు నకిలీ సర్టిఫికెట్లు నర్సంపేట నుంచి రావడంతో పోలీసులకు మరిన్ని అనుమానాలు బలపడేలా చేసింది. గతంలోనే చైల్డ్ హెల్ప్‌లైన్‌లో నకిలీ అనుభవ సర్టిఫికెట్ ఇచ్చి అర్హత జాబితాలో ఎక్కడో మూలకు ఉన్నా కూడా అక్కడి అధికారుల అండదండలతో ఉద్యోగం పొందారన్న ఆరోపణలున్నాయి.

త్వరలో కలెక్టర్‌కు నివేదిక..

దత్తత దందాపై జిల్లా రెవెన్యూ అధికారి నివేదిక మేరకు కలెక్టర్ చర్యలు తీసుకుంటారు. ఈ నివేదిక ఒకటిరెండు రోజుల్లో కలెక్టర్ వద్దకు చేరుతుంది. అలాగే, బాలరక్షాభవన్‌లో చైల్డ్ హెల్ప్‌లైన్ విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి రాజీనామా అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాకే తదుపరి నిర్ణయం ఉంటుంది.

– రాజమణి, వరంగల్ జిల్లా సంక్షేమ విభాగాధికారి

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



సన్మానిస్తున్న డాక్టర్ సుధాకర్

రేగొండ: మండలంలోని మడతపల్లి గ్రామానికి చెందిన జంగిలి అనూష నీట్ ఫలితాలలో 500 మార్కులు సాధించగా గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పూర్వ ఉపాధ్యాయులు ఆదివారం సన్మానించారు. మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన సీనియర్ సర్జన్ అప్పాల సుధాకర్ రూ.10వేలు, గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ సూర రాఘవులు రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనూష కష్టపడి చదివి సమాజానికి సేవ చేయాలన్నారు.

'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న రవియాదవ్

ములుగు రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌశిక్‌రెడ్డి ఎన్నికల్లో గెలిపించకపోతే కుటుంబంతో సహ ఆత్మహత్య చేసుకుంటామని ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి సీతక్క గురించి మాట్లాడడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని లూటీ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తుంటే ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ పబ్బంగడుపుతున్నారని విమర్శించారు. కౌశిక్‌రెడ్డి పద్ధతి మార్చుకోకపోతే కాంగ్రెస్ కార్యకర్తల చేతిలో తన్నులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, పొడాల ఓం ప్రకాశ్, కంబాల రవి, నల్లెల భరత్, యాసం రవికుమార్, షకీల్, అనిల్, బోడ రఘు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొలకలు తిన్న విద్యార్థినులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న కేర్ టేకర్ ఉమారాణి, విద్యార్థినులు గోపిక, మదిహాతబుస్సుం

మహబూబాబాద్ రూరల్ : ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో మల్యాల ఉద్యాన కళాశాల విద్యార్థినులు మొలకలు తిని అస్వస్థతకు గురయ్యారు. దీంతో అదే రోజు రాత్రి సదరు కళాశాల యాజమాన్యం ఆ విద్యార్థినులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేర్ టేకర్ ఉమారాణి, విద్యార్థులు ప్రవీణ్, ఈశ్వర్, విద్యార్థినులు గోపిక, అఖిల, మదిహాతబుస్సుం, సోనియా, హారిక, శివాని చికిత్స పొందుతున్నారు. మరికొంతమంది విద్యార్థులు చికిత్సపొంది కళాశాలకు వెళ్లినట్లు తెలిసింది.

మరికొంత మందికి కూడా చికిత్స..

నెహ్రూసెంటర్: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం మొలకలు తిని అస్వస్థతకు గురైన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విషయం విదితమే. ఈ క్రమంలో శనివారం రాత్రి, ఆదివారం మరికొంత మంది విద్యార్థులు కూడా కడుపు నొప్పితో ఇదే ఆస్పత్రిలో చేరారు. కాగా, ఈ సమాచారం ఆ కళాశాల అధ్యాపకులు తల్లిదండ్రులకు అందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జనగామ రూరల్ : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆది వారం మండలంలోని యశ్వాంతాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. యశ్వంతాపూర్‌లో ఉదయం 6 గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి చనిపోయాడనే గ్రామస్తుల సమాచారం మేరకు సీఐ దామోదర్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. సదరు వ్యక్తి సుమారు 40 నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉండి చామన ఛాయ రంగులో ఉన్నాడు. శరీరంపై నీలం, తెలుపు, నలుపు, పసుపు రంగు గల రాక్ స్టార్ కంపెనీకి చెందిన ఫుల్ షర్టు, ట్విల్స్ కంపెనీకి చెందిన 34 సైజ్ గల బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, బెల్లం కలర్ ఆఫ్ బనియన్ ఉంది. కుడి చేతి పై అమ్మా నాన్న అని పచ్చబొట్టు ఉంది. కుడి చెయ్యిపై పాతవి కత్తి కాట్లు ఉన్నాయి. మృతదేహానికి సంబంధించి ఎలాంటి వివరాలు లభించినా 8712685202, 8712685260, 8712685032 నంబర్లకు ఫోన్ చేయాలని సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత..



హేమలత(ఫైల్)

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన అబ్బోజు హేమలత(35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. శాయంపేట సీఐ రంజిత్ రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అబ్బోజు హేమలతపై భర్త రాజాచారి అనుమానం పెంచుకుని నిత్యం కొడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీన కూడా కొట్టాడు. దీంతో హేమలతకు నీరసంగా ఉండడంతో రాజాచారి గ్లూకోజ్ పెట్టి ఇంజక్షన్ ఇచ్చాడు. అనంతరం హేమలత అస్వస్థతకు గురైనట్లు గమనించిన కుటుంబీకులు.. పరకాలలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం రెఫర్ చేశారు. అనంతరం ఎంజీఎం నుంచి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. తన తండ్రి రాజాచారి గ్లూకోజ్ పెట్టి ఇంజక్షన్ వేయడంతోనే తన తల్లి హేమలత మృతి చెందిందని మృతురాలు పెద్ద కూతురు గాదే శివాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంజిత్ రావు తెలిపారు.

పెసర.. సిరుల పంట

ఈ పంట సాగుతో రైతులకు అధిక ఆదాయం

- వానాకాలం విత్తు సమయం జూలై 15 వరకు
- అన్నదాతలకు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు



డాక్టర్ ఎస్.మాలతి



బి.క్రాంతికుమార్



పెసర మొక్క, (ఇన్‌సెట్‌లో) పెసర్లు

మహబూబాబాద్ రూరల్ : పెసర.. రైతుల ఇంటా సిరులు కురిపించే పంట. తక్కువ నీటి వనరులున్నా ఎక్కువ దిగుబడి ఇచ్చే పంట. ఈ క్రమంలో పెసర పంటలో రకాలు, వాటి సాగులో అవలంబించాల్సిన పద్ధతులు, ముఖ్య సూచనలను మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ తెలిపారు.

పెసర పంట సాగుకు అనుకూల సమయం :

వానాకాలంలో జూన్ 15 నుంచి జూలై 15 వరకు

- ఎంజీజీ-295 పెసర : పంటకాలం 60 నుంచి 65 రోజులు. వానాకాలంతోపాటు యాసంగికి అనుకూలం.
- దిగుబడి: ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్లు.
- లక్షణాలు : మొక్కలు నిటారుగా పెరుగతాయి. కాపు మొక్క పైభాగానే ఉండి గింజ మధ్యస్థ లావు, సాదాగా ఉంటుంది.
- నల్లమచ్చ తెగులును తట్టుకుంటుంది. మొవ్వ కుళ్ల తెగులును కొంత వరకు తట్టుకుంటుంది.

భద్రాద్రి (ఎంజీజీ-348 పెసర)

- పంటకాలం: 65 రోజులు. వానాకాలం, యాసంగికి అనుకూలం.
- దిగుబడి: ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్లు.
- మొక్క పొట్టిగా ఉండి, అంతర పంటకు అనుకూలం.
- యాసంగిలో సాగుకు మిక్కిలి అనుకూలమైనది. బెట్టను కొంతవరకు తట్టుకుంటుంది.

ఎంజీజీ-347 (మధిర పెసర)...

- పంటకాలం: 65 నుంచి 70 రోజులు.
- వానాకాలం, యాసంగి, వేసవికి అనుకూలం.
- దిగుబడి: ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్లు.
- మొక్కలు నిటారుగా పెరుగుతాయి. కాయ మొక్కపై భాగాన ఉండి, గింజ లావుగా, సాదాగా ఉంటుంది.
- మొవ్వకుళ్ల, ఆకుమచ్చ తెగుళ్లను తట్టుకుంటుంది.
- ఈ రకాలు మధిర వ్యవసాయ పరిశోధన స్థానంలో లభిస్తాయి.



యాదాద్రి-(డబ్ల్యూజీజీ-42 పెసర)...

- పంటకాలం: 58 నుంచి 60 రోజులు.
- వానాకాలం, యాసంగి, వేసవికి అనుకూలం.
- దిగుబడి : ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్లు.
- పొడవైన కాయలు కలిగిఉండి, లావుగింజలు కలిగి పల్లాకు తెగులును తట్టుకుంటుంది.
- పత్తిలో అంతరపంటకు అనువైనది.
- ఈ రకం వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో లభిస్తుంది.

మధిర (385 పెసర) :

- పంట కాలం 70 రోజులు
- ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి
- విత్తన మోతాదు ఎకరానికి 10 కిలోలు వేయాలి
- పొడవైన కాయలు కలిగి ఉండి, కాయకు 10 నుంచి 12 గింజలు ఉంటాయి, పల్లాకు తెగులును తట్టుకుంటుంది.

పెసర పంటలో ముఖ్య సూచనలు..

- పెసర విత్తు సమయం ఖరీఫ్ జూన్ 15 నుంచి జులై 15 వరకు.
- పెసరలో వానాకాలంలో అధిక దిగుబడి కోసం యాదాద్రి (డబ్ల్యూజీజీ-42, ఎంజీజీ-295, ఎంజీజీ-347 రకాలను సాగు చేసుకోవాలి.
- విధిగా విత్తన శుద్ధిచేసి విత్తుకోవాలి.
- విత్తిన 25 నుంచి 30 రోజుల వరకు కలుపు లేకుండా జాగ్రత్తపడాలి.
- అవసరం మేరకు కీలక దశల్లో నీటి తడులు ఇవ్వాలి.
- నిండుపూత దశలో నీరు పెట్టొద్దు.
- ఎట్టిపరిస్థితుల్లో పొలంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తపడాలి.
- బెట్ట పరిస్థితుల్లో కీలక దశల్లో 2 శాతం యూరియా పిచికారీ చేస్తే దిగుబడి పెరుగుతుంది.
- రసం పీల్చే పురుగులు తామర, తెల్లదోమ, పేనుబంకను సకాలంలో అదుపు చేయాలి.
- సకాలంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి శనగపచ్చ పురుగు, మారుకామచ్చల పురుగులను నివారించాలి.
- విత్తడం నుంచి కోత వరకు యాంత్రిక పద్ధతులు అవలంబిస్తే ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుంది.

‘శ్రేష్ఠ’ ప్రవేశ పరీక్షలో గౌతమ్‌కు ఆల్‌ఇండియా ఫస్ట్ ర్యాంకు



గౌతమ్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

మహబూబాబాద్ అర్బన్/కేసముద్రం: ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రేష్ఠ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధన్నసరి గ్రామానికి చెందిన పట్ల గౌతమ్ ఆల్ ఇండియా మొదటి ర్యాంకు సాధించాడు. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన పట్ల రవి, కృష్ణవేణి దంపతుల కుమారుడు గౌతమ్ కేసముద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. దేశవ్యాప్తంగా షెడ్యూల్ కులాలకు(ఎస్సీ) చెందిన విద్యార్థులకు మంచి విద్య అవకాశాలు కల్పించేందుకు నిర్వహించే శ్రేష్ఠ ప్రవేశ పరీక్ష ఈనెల 1న రాశాడు. ఈ ఫలితాలు శనివారం రాత్రి విడుదల కాగా గౌతమ్ ఆల్‌ఇండియా మొదటి ర్యాంకు సాధించాడు. ఇదిలా ఉండగా ఇటీవల నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలో ఉమ్మడి జిల్లాలో మొదటి ర్యాంకు, రాష్ట్రీయ మిల్ట్రీ స్కూల్ ప్రవేశ పరీక్షలో 155వ ర్యాంకు, ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్షలో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించిన గౌతమ్.. ప్రస్తుతం శ్రేష్ఠ ప్రవేశ పరీక్షలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఆ విద్యార్థిని స్థానికులు అభినందించారు.

కేయూ పరిధిలో నేటినుంచి ఫార్మసీ కళాశాలల తనిఖీ!

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ ఫార్మసీ కళాశాలలను సోమవారం నుంచి తనిఖీలు చేయనున్నారు. ప్రొఫెసర్లతో కూడిన రెండు లేదా మూడు బృందాలతో తనిఖీలు చేయబోతున్నారు. యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ ఫార్మసీ కళాశాలలకు ఈ విద్యాసంవత్సరానికి(2025-2026)కు సంబంధించి అఫ్లియేషన్ ఇచ్చేందుకు ఆయా కళాశాలలను తనిఖీ చేసేందుకు అధికారులు నిర్ణయించారు. సీడీసీ డీన్ పి. వరలక్ష్మి, అకడమిక్ డీన్, సైన్స్ డీన్ జి. హనుమంతు, ఫార్మసీ కళాశాల డీన్ గాదె సమ్మయ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జె. కృష్ణవేణి, ఫార్మసీ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ వై. నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ ఎస్. ప్రసాద్, ప్రొఫెసర్ స్వరూప, డాక్టర్ నాగరాజు ఈ తనిఖీ బృందాల్లో ఉంటారని భావిస్తున్నారు.

బృందాలుగా విడిపోయి తనిఖీలు..

వీరు రెండు లేదా మూడు బృందాలుగా విడిపోయి ఫార్మసీ కళాశాలలను తనిఖీ చేయనున్నారని విశ్వసనీయంగా తెలిసింది. యూనివర్సిటీ పరిధిలో 24 ప్రైవేట్ ఫార్మసీ కళాలలున్నాయి. తనిఖీ బృందాలు ఆయా కళాశాలల్లో బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఫార్మ్ డి కోర్సుల్లో అధ్యాపకులు సరిపడా ఉన్నారా లేదా, విద్యార్థులకు ల్యాబ్‌లలో పరికరాలు ఉన్నాయాలేదా, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తున్నారా లేదా అనే తదితర అంశాలను పరిశీలించనున్నారు. తనిఖీల అనంతరం వివిధ కళాశాలల్లో ఉండే అధ్యాపకులు, సదుపాయాలను బట్టి కళాశాలల వారీగా ఆయా కోర్సులకు ఎన్నిసీట్లు ఇవ్వాలనేది ని ర్ణయిస్తారు. రిజిస్ట్రార్‌కు ప్రతీ కళాశాల పరిస్థితితో కూడిన నివేదిక సమర్పిస్తారు. అనంతరం వీసీ, రిజి స్ట్రార్లు పరిశీలించి ఎన్నెన్ని సీట్లు ఇవ్వాలనేది నిర్ణయిస్తారు.

ఈ విద్యాసంవత్సరంలో సకాలంలోనే తనిఖీలు..

ఇదిలాఉండగా గత విద్యాసంవత్సరంలో (2024-2025) ఆగస్టులో ప్రైవేట్ ఫార్మసీ కళాశాలలను తని ఖీ చేయగా పలు కళాశాలల్లో సదుపాయాలు, అధ్యాపకులు లేరనే విషయం గుర్తించి వివిధ కళాశాలలకు సీట్లు తగ్గించారు. ఈసారి విద్యాసంవత్సరంలో(2025-2026) జూన్‌లోనే సకాలంలోనే తనిఖీ లు చేయబోతున్నారు. గతేడాదికంటే ఆయా కళాశాలలు మెరుగుపడ్డాయా లేదా అనేది తేలిపోనుంది. వాస్తవంగా పలు ఫార్మసీ కళాశాలల్లో కోర్సుల వారీ గా విద్యార్థులకు సరిపడా అధ్యాపకులు ఉండడం లేదు. అలాగే, ల్యాబ్ పరికరాలను సరిగా ఏర్పాటచేయని కళాశాలలున్నాయి. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ఫార్మ్ డి కోర్సును నడి పే కళాశాలలకు అనుబంధంగా తప్పనిసరిగా 300 పడకల ఆస్పత్రి కలిగి ఉండాల్సింటుంది. అందు కు ఏదైనా ఆస్పత్రితో ఎంఓయూ ఒప్పందం కలిగి ఉండాల్సింటుంది. బీ ఫార్మసీ, ఎం ఫార్మసీకి సంబంధంలేకుండా ఫార్మ్ డి కోర్సు విభాగానికి ప్రత్యేకంగా హెచ్‌ఓడీ కూడా ఉండాల్సింటుంది. ఇలా అనేక అంశాలను ఈసారి పరిశీలించనున్నారు. ఆ తర్వాతే ఎన్నిసీట్లు ఇవ్వాలనేది నిర్ణయిస్తారు.

పింఛన్ ఇప్పిస్తానని.. పుస్తెలతాడుతో పరారీ

- నర్సంపేటలో గుర్తుతెలియని వ్యక్తి మోసం!
- లబోదిబోమంటున్న వృద్ధ దంపతులు



రోదిస్తున్న వృద్ధ దంపతులు

నర్సంపేట రూరల్ : ఆసరా పింఛన్ ఇప్పిస్తానని నమ్మబలికి వృద్ధ దంపతులను మోసం చేసి మూడు తులాల బంగారు పుస్తెల తాడుతో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఉడాయించాడు. ఈ ఘటన నర్సంపేట పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. నర్సంపేటలోని రెండో వార్డు మార్కండేయ కాలనీకి చెందిన వృద్ధులు మాటేటి సరోజన, సర్వేశం ఆదివారం పట్టణంలో అంగడి కావడంతో కూరగాయలు కొనేందుకు వెళ్లారు. అక్కడ ఓ గుర్తు తెలియని వ్యక్తి వారికి పరిచయమై ‘మీకు పింఛన్ ఇప్పిస్తానని నమ్మ బలికాడు. పింఛన్ రావాలంటే ఫొటో తీయాలని, మెడలో ఉన్న పుస్తెలతాడు తీసి పట్టుకోమని చెప్పాడు. ఒక పేపర్ ఇచ్చి జిరాక్స్ తీసుకుని రావాలని చెప్పాడు. అనంతరం నీ (వృద్ధురాలు) చేతిలో ఉన్న బంగారు పుస్తెలతాడు నేను పట్టుకుంటా’ అని చెప్పడంతో వారు నమ్మి జిరాక్స్ కోసం వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా అక్కడ సదరు వ్యక్తి కనిపించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. వృద్ధ దంపతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ పేర్కొన్నారు.

దొంగల ముఠా అరెస్ట్

- బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏనుమాముల సీఐ సురేశ్



పట్టుబడిన నిందితులు, బైకులను చూపుతున్న ఇన్‌స్పెక్టర్ సురేశ్

ఖిలా వరంగల్ : పక్కా ప్రణాళికతో ఇంటిబయట పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు, తాళం వేసిన ఇళ్లల్లో రాత్రుళ్లు చోరీలకు పాల్పడుతున్న ఏడుగురు దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి బైక్‌లు, కుదువ పెట్టిన బంగారు ఆభరణాల రసీదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపారు. ఏనుమాముల ఠాణాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగల ముఠాను ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు. ఏనుమాముల బాలాజీనగర్‌కు చెందిన కనుకుంట్ల అఖిల్, కాశిబుగ్గ లక్ష్మీగణపతి కాలనీకి చెందిన అఖిల్ జల్సాలకు అలవాటు పడ్డారు. హైదరాబాద్‌కు చెందిన వీరి స్నేహితులు మహమ్మద్ అజీం, గౌరీకిశోర్, శశాంత్, రాపోలు చరణ్ తేజ, ఎర్రమనేని సూర్యప్రకాశ్‌తో కలిసి రాత్రిసమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ-2, బాలాజీనగర్ జంక్షన్‌లోని ఇళ్లలో బాధితులను బెదిరించి, దాడి చేసి బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. చోరీ చేసిన బంగారాన్ని స్నేహితుల ద్వారా మాయమాటలు చెప్పి ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం గోల్డ్ లోన్ వంటి వాటిలో కుదువ పెట్టి నగదు తీసుకొని జల్సాలు చేసే వారు. 100 ఫీట్ల రోడ్డు, కీర్తినగర్, బాలాజీ నగర్ ఏరియాలో ఇంటిబయట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసి హైదరాబాద్‌లో ఉండే సూరజ్ అనే వ్యక్తి ద్వారా సెకండ్ హ్యాండ్‌కి లేదా అవసరం ఉన్న వారికి విక్రయించే వారు. ఈ ముఠా ఇటీవల లక్ష్మీగణపతి కాలనీలో సీసీ కెమెరాలు, టీవీ ధ్వంసం చేసి రూ.3లక్షల నగదు చోరీ చేసి కాశీయాత్ర చేశారు. వీరు గతంలో దోపిడీ, సెల్‌ఫోన్ దొంగతనాల్లో నిందితులుగా ఉన్నారు. జైలు జీవితం గడిపిన వారిలో మార్పు రాక, పలు నేరాలకు పాల్పడుతున్నారు. ఈ కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏనుమాముల పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి శనివారం రాత్రి రెడ్డిపాలెం సమీపంలో ఏడుగురిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి బైకులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపారు.

సౌరశక్తి.. అనాసక్తి

సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై రైతుల విముఖత | వేలల్లో దరఖాస్తులు.. వందల్లో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్

- టీజీఎన్పీడీసీఎల్‌లో 2,098 మంది దరఖాస్తు
- అగ్రిమెంట్ చేసుకున్నది 133 మంది
- టీజీ ఎస్పీడీసీఎల్‌లో 2,265 మంది దరఖాస్తు
- పవర్ పర్చేజ్ చేసుకున్నది 163 మంది



హన్మకొండ : సోలార్ (సౌరశక్తి) విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై రైతుల్లో ఆసక్తి తగ్గింది. వేలల్లో దరఖాస్తులు రాగా, వందల్లో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్‌లే ఇందుకు నిదర్శనం. భారీ పెట్టుబడి..గిట్టుబాటు కాని ధర.. 12 ఏళ్ల వరకు రైతుకు ప్రయోజనం లేకపోవడం.. రైతు వాటాగా రూ.లక్షల్లో చెల్లించాల్సి రావడం.. ప్రతీ నెల ఆదాయం నిలకడగా వస్తుందనే నమ్మకం లేకపోవడంతో సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై రైతుల్లో తీవ్ర విముఖత వ్యక్తమవుతోంది. దరఖాస్తు చేసిన నాటి ఉత్సాహం ఈఎండీ చెల్లింపులో కనిపించలేదు. కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు ప్లాంట్ ఏర్పాటుపై రైతులను ప్రోత్సహిస్తోంది. ఇందుకు ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఎవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుం) పథకాన్ని తీసుకు వచ్చింది. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ, టీజీ ఎన్పీడీసీఎల్, టీజీఎస్పీడీసీఎల్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రైతులతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, నీటి వినియోగదారుల సంఘాలు సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేల పథకాన్ని రూపొందించారు. ప్రభుత్వ, దేవాలయ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. వీరు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను స్థానిక డిస్కంలు ముందుగా నిర్ణయించిన టారిఫ్ ధరలకు కొనుగోలు చేస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యం కాగా రైతుల నుంచి స్పందన కనిపించడం లేదు.

నత్తనడకన అగ్రిమెంట్ ప్రక్రియ..

పీఎం కుసుం పథకం ద్వారా దరఖాస్తు చేసుకునే నాటి నుంచి పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ వరకు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. టీజీ ఎన్పీడీసీఎల్‌లో 2,098 మంది, 2,788.900 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 520 మంది రైతులు 683.800 మెగావాట్లకు రూ. లక్ష చొప్పున ఈఎండీ చెల్లించారు. 439 మందికి 561.7 మెగావాట్లకు లెటర్ ఆఫ్ అక్సెప్టన్సీ జారీ చేశారు. కాగా ఇప్పటి వరకు 133 మంది రైతులు 161 మెగా వాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు మాత్రమే పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకున్నారు.అదే విధంగా టీజీ ఎస్పీడీసీఎల్‌లో 2,265 మంది రైతులు 3,369.500 మెగావాట్లకు దరఖాస్తు చేసుకోగా 682 మంది రైతులు 1035.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఈఎండీ చెల్లించారు. ఇందులో 560 మంది రైతులకు 850.8 లెటర్ ఆఫ్ అక్సెప్టన్సీ జారీ చేశారు. కాగా ఇప్పటి వరకు 163 మంది రైతులు 225 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు డిస్కంతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకున్నారు.

ముందుకు రాని రైతులు..

సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు మూడు సార్లు, ఈఎండీలు చెల్లించేందుకు రెండు సార్లు గడువు విధించింది. అయినా దరఖాస్తులు వచ్చిన మేరకు ఈఎండీలు చెల్లించడానికి రైతులు ముందుకు రాలేదు. ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు రూ.3 కోట్ల ఖర్చు అవుతుంది. ఇందులో రైతులు తమ వాటాగా 25 శాతం భరిస్తే, బ్యాంకుల ద్వారా 75 శాతం రుణ సదుపాయాన్ని కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేంత పెట్టుబడి తాము వెచ్చించలేమని రైతులు చెబుతున్నారు. తమ స్థలం నుంచి సబ్‌స్టేషన్ వరకు అయ్యే ఖర్చులు భరించలేమని, ప్రభుత్వం యూనిట్‌కు చెల్లిస్తామని చెప్పిన రూ.3.13లు ఎటు సరిపోవని తేల్చి చెబుతున్నారు. 12 ఏళ్ల వరకు రుణ వాయిదాలు చెల్లించాల్సి రావడంతో అప్పటి వరకు రైతుకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని వాపోయారు. అదే విధంగా 25 ఏళ్ల వరకు యూనిట్‌కు రూ.3.13 మాత్రమే చెల్లించడం ఏ మాత్రం గిట్టుబాటుకాదని, రాయితీ లేకపోవడంతో దారుణ భారం పడుతోందని, దీంతో తాము సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు రావడం లేదని పలువురు రైతులు చెప్పారు.

అప్పుల బాధతో రైతుల ఆత్మహత్య

- గూడూరు, శామీర్‌పేటలో ఘటన



ప్రతాప్ (ఫైల్)

కమలాపూర్: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గూడూరుకు చెందిన రైతు కుమ్మరి ప్రతాప్ (42) తనకున్న వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్లుగా పంట దిగుబడి సరిగా రాక పెట్టుబడులు కోల్పోయి సుమారు రూ.12 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చలేని పరిస్థితిలో మనస్తాపానికి గురై ఈ నెల 21న రాత్రి తన పొలం వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు వెంటనే ప్రతాప్‌ను వరంగల్ ఎంజీఎం తరలించగా ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య సృజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

శామీర్‌పేటలో మరో రైతు..



భాస్కర్ (ఫైల్)

జనగామ రూరల్ : అప్పుల బాధతో ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని శామీర్‌పేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాపల భాస్కర్ (41) గ్రామంలో తనకు ఎకరం అసైన్డ్ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. వ్యవసాయంతోపాటు ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లకు సుమారు రూ. 5 లక్షలకు పైగా అప్పు చేశాడు. తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురై వ్యవసాయ బావి వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మంచానికే పరిమితమయ్యాననే మనస్తాపంతో..

- యువకుడి బలవన్మరణం..
- అన్నాసాగరంలో ఘటన



రాకేశ్ (ఫైల్)

హసన్‌పర్తి: ఆ యువకుడు సుమారు 8 నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నాడు. ఫలితంగా మంచానికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. దీనిపై కొంతకాలంగా మనస్తాపం చెందుతున్న అతడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని అన్నాసాగరం గ్రామానికి చెందిన పల్లకొండ రాకేశ్(33) దినసరి కూలీ. అతడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. సుమారు 8 నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయి మంచానికే పరిమితయ్యాడు. దీంతో కుటుంబ పోషణ కష్టతరమవడంతో కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు.

చనిపోతానని తల్లితో చెప్పి..

ఈ క్రమంలో రాకేశ్ శనివారం రాత్రి తన తల్లి లక్ష్మికి ఫోన్‌చేసి చనిపోతానని చెప్పాడు. ఆదివారం ఉదయం చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడాడ్డు. దీనిపై సమాచారం అందుకున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

వర్షాల కోసం గంగమ్మకు వరదపాశం



వరదపాశంను ఆరగిస్తున్న యాదవులు

బయ్యారం: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ.. ఆదివారం బయ్యారంలో యాదవులు గంగమ్మతల్లికి వరదపాశం పోశారు. గ్రామ సమీపంలోని అలిగేటిలో రాయిని దేవతగా పూజించి తల్లికి ఇష్టమైన పాల పొంగళ్లను బండపై పోసి యాదవులు ఎంగిలిని మరిచి ఆరగించారు. తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఈ ఆచారం ప్రకారం గంగమ్మతల్లికి వరదపాశం పోసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో యాదవులు సతీశ్, లింగయ్య, వీరన్న, సాయి, లోకేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వేస్టాఫ్‌కు రూ.25 వేల గ్రూప్ అవార్డు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే స్టాఫ్‌కు గ్రూప్ అవార్డుగా రూ.25 వేల నగదు పురస్కారం ప్రకటించినట్లు కాజీపేట రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. శనివారం కాజీపేట రైల్వే మోడల్ రన్నింగ్ రూంను ప్రారంభించిన రైల్వే జీఎం.. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి రైల్వే స్టాఫ్ అందరికి గ్రూప్ అవార్డు కింద రూ.25 వేలు నగదు పురస్కారం ప్రకటించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైల్వే జీఎంకు ఆయా విభాగాల రైల్వే అధికారులు, స్టాఫ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్అండ్‌టీ, ఆపరేటింగ్ కూడా..

కాజీపేట రైల్వే రన్నింగ్ రూంను ప్రారంభించేందుకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్‌కు రూ.10 వేల నగదు, ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్‌కు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్స్‌పాల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ పద్మజా రూ.10 వేల నగదును ప్రకటించినట్లు కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్ ఆదివారం తెలిపారు. కాజీపేట రైల్వే సిబ్బందికి నగదు పురస్కారం ప్రకటించిన రైల్వే జీఎం, పీసీఓంలకు అగ్గి రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.